ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- రాష్ట్ర పరిషత్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది.
- విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- స్వచ్ఛ సర్వేక్షణ్ లో రాష్ట్రానికి చెందిన ఆరు పట్టణ స్థానిక సంస్థలకు అవార్డులు ప్రకటించడం పట్ల మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు.
- న్యూజిలాండ్‌లో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన రెండో వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత్ 4 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపొందింది.

==========

రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల కౌంటింగ్ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఎక్కువగా విజయం నమోదు చేశారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గానూ 316కి పైగా స్థానాల్లోనూ.. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గానూ 6128కి పైగా స్థానాలలో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16 జడ్పీటీసీ, 1201 ఎంపీటీసీ స్థానాలలో గెలుపొందింది. ఈ ఫలితాలను ఎన్నికల సంఘం ఇంకా ధృవీకరించవలసి వుంది.

==========

విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ లో చర్చించే అంశాలు, డిక్లరేషన్లపై సీఐఐ ప్రతినిధులు, అధికారులతో చర్చించారు. విశాఖ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలో అనేక రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రచారం చేయాలన్నారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానిస్తూ... చర్చలను వ్యాపార, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా తీసుకువెళ్లాలని సూచించారు. ప్రపంచ మార్కెట్లతో రాష్ట్ర పరిశ్రమలను వ్యాపార పరిచయాలు కల్పించడం ప్రధాన లక్ష్యం కావాలన్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి విశాఖ సదస్సు తీసుకురానుంది. 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

==========

స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా రాష్ట్రంలోని ఆరు పట్టణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించడం పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమహేంద్రవరం, తిరుపతి నగర పాలక సంస్థలతో పాటు కుప్పం మున్సిపాలిటీకి ఈ అవార్డులు ప్రకటించడం రాష్ట్ర పురపాలక శాఖకు జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు లభించినట్లయిందని మంత్రి పేర్కొన్నారు. అమరావతిలో

ఆయన ఈరోజు మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆయా నగరపాలక సంస్థల అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బందికి మంత్రి అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలను డంపింగ్ యార్డులు లేని పట్టణాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్వచ్ఛతను ప్రజా ఉద్యమంగా మార్చి, రాష్ట్రంలోని ప్రతి పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ నెల 11వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రదానం చేయనుందని మంత్రి నారాయణ వెల్లడించారు.

==========

ఉపాధి కోసం రష్యా వెళ్లి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రంలో చిక్కుకున్న అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. శ్రీకాకుళంలో బాధిత యువకుల కుటుంబ సభ్యులు ఈరోజు కేంద్రమంత్రిని కలిశారు. ఉపాధి కోసం రష్యాలో ఫ్రూట్ ప్యాకింగ్, ఫుడ్ ప్యాకింగ్ వంటి సాధారణ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఏజెంట్లు నమ్మించడంతో ఐదుగురు యువకులు అక్కడికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు మంత్రికి వివరించారు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత ఉద్యోగాల పేరుతో వారిని రష్యా సైన్యంలోకి తీసుకెళ్ళారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఆవేదనను విన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలు, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

==========

పట్టణం నుంచి పల్లె వరకు ఎన్డీయే కూటమి సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. అమరావతిలో ఆయన మాట్లాడుతూ కూటమి ఘన విజయానికి సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయం కేవలం ఎన్నికల్లో గెలుపు మాత్రమే కాదని.. కూటమి పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయం తమ పాలనపై బాధ్యతను మరింత పెంచిందని పేర్కొంటూ...

(వాయిస్...20 సెకన్లు)

==========

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) సాధికారిక మండలి సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద జరిగిన కార్యక్రమంలో టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కె.కన్నబాబు మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో తనకు ఈ గొప్ప అవకాశం లభించిందని అన్నారు. తనపై విశ్వాసం ఉంచి సాధికారిక మండలి సభ్యుడిగా నియమించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

==========

విరామం

==========

సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా ప్రతి అధికారి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని విశాఖపట్నం కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో సదస్సు ఏర్పాట్లపై ఈరోజు సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖ వేదికగా నిర్వహించనున్న సదస్సుకు 3 వేల నుంచి 5 వేల మంది వరకు ప్రముఖులు, వివిధ రంగాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారి రాకపోకలు, వాహనాలు, పాసుల జారీ, ప్రోటోకాల్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించే కార్యక్రమాలు, సమావేశాలు, మౌలిక సదుపాయాలు, రాష్ట్ర స్థాయి అధికారులతో సమన్వయ బాధ్యతలను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పర్యవేక్షిస్తారని తెలిపారు.

==========

ప్రజలందరూ జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ జరుపుకోవాలని విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. నగరంలో ఏర్పాటు చేసిన పలు బాణాసంచా దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా,

నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దీపావళి అందరిలో చీకట్లను పారద్రోలి మరిన్ని కాంతులు నింపాలని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణాసంచాను సరైన జాగ్రత్తలు పాటిస్తూ కాల్చాలన్నారు. చిన్నపిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా తల్లితండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే డయల్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలని సీపీ ప్రజలకు సూచించారు.

==========

పశ్చిమగోదావరి జిల్లాలో ఆర్నబ్ తుఫాను వలన నష్టపోయిన బాధితులందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో తుఫాను బాధితులకు కలెక్టర్ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్నబ్ తుఫాను వల్ల ప్రభావితమైన 5 లక్షల 63వేల మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని చెప్పారు. 50 కేజీలు బియ్యం, కేజీ పంచదార, లీటర్ పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు కేజీ చొప్పున అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

==========

స్వచ్ఛత పక్షోత్సవం - 2026లో భాగంగా ఎగుమతి తనిఖీ సంస్థ విశాఖపట్నం ఉప కార్యాలయంలో ఈరోజు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఇన్చార్జి సుధాన్సు శేఖర్ దాస్ పరిశుభ్రత, పారిశుద్ధ్యం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

==========

న్యూజిలాండ్ లో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్ లో న్యూజిలాండ్ జట్టుపై భారత్ గెలుపొందింది. ఈ మ్యాచ్ కు వర్షం అంతరాయం కలిగించడంతో టాస్ ఆలస్యమైంది. దీంతో మ్యాచ్ ను 47 ఓవర్లకు కుదించగా.. టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ కు దిగిన న్యూజిలాండ్.. 41 ఓవర్లలో కేవలం 134 పరుగులు ఆలౌటైంది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలో తడబడినప్పటికీ పలుమార్లు వర్షం అంతరాయం కలిగించడంతో డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో టీమిండియా 4 పరుగుల తేడాతో న్యూజిలాండ్ పై విజయం సాధించింది.

==========

BRICS సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు “వ్యర్థాలను తగ్గిద్దాం - పునర్వినియోగం, రీసైక్లింగ్ ను ప్రోత్సహిద్దాం (Reduce Waste - Reuse - Recycle)” అనే నినాదంతో అల్లూరి సీతారామరాజు జిల్లా APSRTC పాడేరు డిపో ఆధ్వర్యంలో ఈరోజు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో డిపో సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. బస్ స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ వాటర్ బాటిళ్లు, ఇతర చెత్తను సేకరించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. పునర్వినియోగ వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని RTC అధికారులు పిలుపునిచ్చారు.

==========
==========